'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# పార్లమెంటు భద్రత ప్రశ్నార్థకం

**పాత** పార్లమెంటు భవనంపై ఉగ్రదాడి జరిగిన రోజే కొత్త పార్లమెంటులో భద్రతా ఉల్లంఘనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. పార్లమెంటులో లోక్‌సభ సమావేశమందిరంలో ఆగంతకులు జొరబడి రంగువాయువులు వెదజల్లుతూ బీభత్సం సృష్టించడం టీవీల్లో చూసిన దేశం ఉలిక్కిపడింది. వెలుపల మరి కొందరు అలాంటి చర్యకే ఒడిగట్టడం మరింత దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఆగంతకులు ఉపయోగించిన రంగు వాయువులు ప్రమాదకరమైనవి కావని తేలడం కొంత ఉపశమనం కలిగించింది. వారిలో ఒకరు బీజేపీ ఎంపీ జారీచేసిన సందర్శకుల పాస్‌తో పార్లమెంటు ప్రాంగణంలోకి అడుగుపెట్టడం గమనార్హం. పార్లమెంటు సభ్యులకు హాని తలపెట్టడం వారి ఉద్దేశం కాదని ప్రమాదరహిత వాయువులు అని స్పష్టం చేస్తున్నప్పటికీ అసలు ఉద్దేశం ఏమై ఉంటుందనేది ఇంకా తెలియరాలేదు.

పాత పార్లమెంటుపై దాడి జరిగినప్పుడు, ఇప్పుడు నూతన పార్లమెంటుపై దాడి జరిగినప్పుడూ రెండు సందర్భాల్లోనూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉండటం కాకతాళీయం కావచ్చు. పరిశీలకుల దృష్టికి తప్పనిసరిగా వచ్చే అంశాల్లో ఇది కూడా ఉంటుందని గుర్తుంచుకోవాలి. 2001లో ఉగ్రవాదులు దాడి చేయగా భద్రతా సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని మట్టుబెట్టడం దేశ ప్రజలకు ఇంకా గుర్తుంది. వారి అమరత్వాన్ని గుర్తుచేసుకోవాల్సిన రోజే మరోదాడి జరగడం కలతకు గురిచేసే అంశమే. నాటి దాడి పర్యవసానంగా పార్లమెంటు భద్రతను కట్టుదిట్టం చేసినట్టు వార్తలు కూడా వచ్చాయి. అప్పటికీ, ఇప్పటికీ భద్రతా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. అయినప్పటికీ 2016లో ఓ దుండగుడు నోట్ల రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంటులోకి దూసుకుపోవడం సంచలనం కలిగించింది. ఉభయసభల సమావేశాలు ఇటీవల కొత్తగా కట్టిన భవనంలోకి మారిపోయాయి.

సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండా పార్లమెంటులోకి ఈగ కూడా ప్రవేశించదని సామాన్యులు అనుకునే రోజులివి. రాజకీయ ప్రముఖులపై, అధికార ప్రాంగణాలపై ఇదివరకు జరిగిన దాడుల దృష్ట్యా భద్రతాపరంగా పకడ్బందీ ఏర్పాట్లు ఉండే ఉంటాయని ఎవరైనా ఆశిస్తారు. గత దాడితో పోలిస్తే ఎన్నో రెట్లు ఎక్కువ భద్రత ఉంటుందని నమ్మే నూతన పార్లమెంటు వద్ద దుండగులు స్వైరవిహారం చేయడం ఎలా సాధ్యమైంది? వారు వెంట తెచ్చుకున్నవి ప్రమాదరహితమైన రంగు వాయువులే కావచ్చు. వాటి స్థానంలో విషవాయువుతోనో, మారణాయుధాలతోనో లోపలికి వెళ్తే ఏం జరిగేది? అనేవి ఇప్పుడు అందరి మనసుల్లో మెదులుతున్న కీలక ప్రశ్నలు. దాడిచేసిన వారి ఉద్దేశం ఏమై ఉంటుందనేది ఢిల్లీ పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావచ్చు. ఎలా చూసినా ఈ ఉదంతంతో పార్లమెంటు భద్రతావ్యవస్థ సామర్థ్యం ప్రశ్నార్థకమైందని చెప్పక తప్పదు. సభ భద్రత బాధ్యత తనదే కనుక తానే స్వయంగా దీనిపై లోతైన దర్యాప్తు జరిపిస్తానని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో దాడి జరిగిందన్నది ఇక్కడ గుర్తుంచుకోవాలి. దేశ రాజకీయవ్యవస్థకు గుండెకాయ వంటి పార్లమెంటు భవనం భద్రతను పూర్తి కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## రెండు నిమిషాలేనా?

*భారత ఎన్నికల కమిషన్ పాత్ర ఎన్నికలు నిర్వహించడమే కాదు.. అంతకంటే ఎక్కువ. అలాంటి ఈసీపై చర్చించేందుకు రెండు నిమిషాలే కేటాయించడం దారుణం. రెండు నిమిషాల్లో మ్యాగీ న్యూడిల్స్ చేయవచ్చన్న ప్రకటన లెక్కనే రెండు నిమిషాల్లోనే చెప్పాలనుకున్న విషయాన్ని ఎలా చెప్పాలో నేర్చుకున్నాం.*



**- ప్రియాంక చతుర్వేది,** రాజ్యసభ సభ్యురాలు

# మన తెలంగాణ జల సమృద్ధం

"సరిగ్గా పదేండ్ల కిందట... తెలంగాణలో ఎక్కడ చూసినా దయనీయమైన స్థితిలో ప్రజలు కనిపించారు. ఒక్కపూట కూడా తిండికి నోచుకోని పేదరికం తెలంగాణను ఆవరించింది. వేసవిలో గంజి కేంద్రాలు, ఆకలిచావులు, పొట్టకూటి కోసం వలసలు, చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక ఆత్మహత్యలు.. ఇదీ ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంత పరిస్థితి. అప్పటి పాలకుల పుణ్యమాని గ్రామీణ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైంది. పంట పొలాలు బీళ్లుగా మారినయి. నీటి జాడ కానరాని చెరువులు పిచ్చి మొక్కలతో నిండినయి. ఎండిన బావులు, వెయ్యి అడుగులు తవ్వినా నీరు పడని బోర్లతో వేలాది రైతు కుటుంబాలు గుండెలు బాదుకున్నయి. శిథిలమైన ప్రాజెక్టులతో నదీ జలాలు సముద్రంలో కలిసిపోయినయి."



**వి.ప్రకాశ్**
90009 50400



నీళ్లు, నిధులు, నియామకాల్లో వలస పాలకులు చూపిన వివక్ష, ఫలితంగా వేలాది రైతుల ఆత్మహత్యలు... వెరసి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ప్రారంభానికి కారణాలు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రైతుల ఆత్మహత్యల నివారణే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగారు. సాగునీటిరంగం-వ్యవసాయ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. తన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రాష్ట్ర ఆదాయంలోని సింహభాగం ఈ రంగాలపై ఖర్చుపెట్టారు.

సాగునీటి అభివృద్ధి కోసం ముందుగా చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం 'మిషన్ కాకతీయ'. సుమారు తొమ్మిది వేల కోట్ల రూపాయలతో 46 వేలకు పైగా ఉన్న చిన్న నీటి వనరులను (వీటిలో సుమారు 28 వేల చెరువులు, కుంటలు) పునరుద్ధరించింది కేసీఆర్ ప్రభుత్వం. వీటి కింద సుమారు 20 లక్షల ఎకరాలకు సాగునీరందుతున్నది. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం చెరువులు, కుంటల కింద నాలుగైదు లక్షల ఎకరాలకు కూడా సాగునీరందని పరిస్థితి.

> చెరువుల్లో, కుంటల్లో పూడికతీయడంతో ఆ సారవంతమైన మట్టిని (సుమారు 7 కోట్ల ట్రాక్టర్ల లోడ్) రైతులు తమ పంట పొలాలకు స్వచ్ఛందంగా తరలించారు. మట్టిని తరలించే వ్యయం తగ్గడం, పనులను 30-40 శాతం తక్కువకు కాంట్రాక్టర్లు చేపట్టడం వల్ల ప్రభుత్వం రూ. 22 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'మిషన్ కాకతీయ' ప్రాజెక్టు కేవలం రూ. 9 వేల కోట్లతోనే పూర్తయింది.

పూడికమట్టి వల్ల రైతులకు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి డబ్బు ఆదా అయింది. పూడికతీత వల్ల భూగర్భ జలాలు కూడా 6 నుంచి 8 మీటర్ల మేర పైకి వచ్చినట్లు భూగర్భ జలశాఖ పరిశీలనలో వెల్లడైంది. ఎండిన బావులు, బోర్లలోకి కొత్తగా నీరు చేరి పరోక్షంగా సాగు పెరగడానికి దోహదపడింది.

కేసీఆర్ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' తర్వాత పెండింగ్‌లో ఉన్న దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలపై దృష్టిపెట్టింది. చంద్రబాబునాయుడు తన తొమ్మిదేండ్ల పాలనలో సర్వేల పేరుతో కాలయాపన చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 'జలయజ్ఞం'లో ఈ ప్రాజెక్టులను చేర్చి పనులను చేపట్టినా 2014 నాటికి కూడా ఇవి పూర్తికాలేదు. కేసీఆర్ ఈ ప్రాజెక్టులను పూర్తిచేయడానికి అవసరమైన నిధులను కేటాయించి లక్ష ఎకరాలకు కూడా సరిగా నీరందని కరువు సీమ ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు మరో 10 లక్షల ఎకరాలకు సాగునీరందించారు. ఈ నదీజలాలతో వర్షాధారిత చెరువులకు నీటిని మళ్లించడంతో మండు వేసవిలో సైతం చెరువులు అలుగు దుంకుతుంటే ఆ అపురూప దృశ్యాలతో ప్రకృతి పరవశించింది. ఎండిన వాగులపై వేదనతో 'వాగు ఎండి పాయెరా' అని పాటరాసిన గోరటి వెంకన్న కవి హృదయానికి నిండుగా పారుతున్న వాగుల సోయగాలతో ఉపశమనం కలిగింది.

జలయజ్ఞంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చేపట్టిన పలు ప్రాజెక్టుల డొల్లతనాన్ని పసిగట్టిన కేసీఆర్ ఆయా ప్రాజెక్టుల రీ డిజైనింగ్ అవసరాన్ని గుర్తించారు. గోదావరికి ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ వంటి 13 బ్యారేజీలను నిర్మించి ఎక్కడికక్కడ ఎత్తిపోతల పథకాలను నిర్మించి వేలాది ఎకరాలకు సాగునీరిందించటంతో శ్రీరాంసాగర్ నీటి ప్రవాహం బాగా తగ్గింది. ఈ ప్రాజెక్టు కింది ఆయకట్టు మొదటిదశకు కూడా నీరందే అవకాశం లేదు. ఈ సంగతి తెలిసి కూడా కాకతీయ కాల్వను డోర్నకల్, తుంగతుర్తి వరకు సుమారు 200 కిలోమీటర్లకు పైగా తవ్వించి శ్రీరాంసాగర్ రెండోదశ నిర్మాణానికి పూనుకున్నారు. వైఎస్ కాల్వలు రావడం వల్ల సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరందుతుందని వరంగల్, నల్గొండ రైతులు ఆశపడ్డారు. ఇవి కేవలం కాంట్రాక్టర్లకు పని కల్పించి కమీషన్లు పొందడానికి, 'తెలంగాణలో సాగునీటిరంగం అభివృద్ధి చేస్తున్నానని, తెలంగాణ రాష్ట్రం అవసరం లేద'ని ప్రజలను నమ్మించడానికి వైఎస్‌కు పనికివచ్చాయి. మంజీరా నదిపై ఇలాంటి బ్యారేజీలనే మహారాష్ట్ర 32, కర్ణాటక 5 నిర్మించి ఎత్తిపోతలతో నదిలోకి వచ్చే నీటిని మొత్తం ఆయా రాష్ట్రాల్లో సాగుకు మళ్లించడంతో సింగూరు, నిజాంసాగర్‌కు తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని సుమారు ఇరవై లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రత్యామ్నాయ సాగునీటి ఏర్పాటు అవసరమైంది.

మరోపక్కన తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 అడుగుల ఎత్తున నిర్మించతలపెట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ముందుకు సాగకుండా కేంద్ర జలసంఘం, మహారాష్ట్ర అడ్డుపడ్డాయి. బ్యారేజీ నిర్మాణ స్థలం మహారాష్ట్రలోని వన్య మృగ సంరక్షణ కేంద్రం జోన్‌లో ఉన్నదని, ఆ ప్రాంతం ముంపునకు గురికాకుండా 148 అడుగుల ఎత్తుతో బ్యారేజీ నిర్మించుకోవచ్చునని మహారాష్ట్ర తెలిపింది. కాగా తెలంగాణ వినియోగానికి వంద టీఎంసీలకు మించి నీరు ఈ ప్రదేశంలో అందుబాటులో లేదని, 160 టీఎంసీల వినియోగానికి అవసరమైన రిజర్వాయర్లు (కేవలం 14 టీఎంసీల రిజర్వాయర్లనే డీపీఆర్‌లో చూపించారు) లేవని కేంద్ర జల సంఘం అభ్యంతరాలు తెలిపింది. దీంతో గత్యంతరం లేక కాళేశ్వరం రీ-డిజైనింగ్‌పై కేసీఆర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రముఖ ఇంజినీర్లు, డబ్ల్యూఏపీసీఓఎస్ (వ్యాప్కోస్-కేంద్ర ప్రభుత్వం సంస్థ) నిర్ణయించినట్టుగా కేవలం మూడేండ్లలోనే లక్ష్మీ (మేడిగడ్డ), సరస్వతి (అన్నారం), పార్వతి (సుందిళ్ళ) బరాజ్‌లను, మరో మూడు పంపింగ్ స్టేషన్లను నిర్మించారు.

> ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైనది మల్లన్నసాగర్ రిజర్వాయర్. దీని నిర్మాణాన్ని ముందుకుపోనీయకుండా ప్రతిపక్ష నాయకులు నిర్వాసితులచే, ఇతరులచే అనేక కేసులను పెట్టించడంతో కొద్దిగా ఆలస్యమైంది. నిజాంసాగర్, శ్రీరాంసాగర్, అప్పర్ మానేరు, హల్దీ, కడవేరు వాగులోపల గల చెక్‌డ్యాంలు పునరుజ్జీవం పొందడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగపడింది. సుమారు ఇరవై లక్షల ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకూ నీరందించగలిగారు కేసీఆర్.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18 లక్షల ఎకరాలకుపైగా కొత్త ఆయకట్టుకు సాగునీరందించి, మరో ఇరవై లక్షల ఎకరాలకు పైగా పాత ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరించాలని కేసీఆర్ భావించారు. కృష్ణా, భీమా, తుంగభద్రా నదుల పరీవాహక ప్రాంతంలోని ప్రధాన నదులపై ఉపనదులపై మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో వందలాది బరాజ్‌లు నిర్మించడం, ఆల్మట్టి ఎత్తు పెంపు తదితర కారణాల వల్ల తెలంగాణలోని కృష్ణా ప్రాజెక్టులకు తీవ్రమైన నీటి కొరత ఏర్పడుతున్నది. కరువు సీమ పాలమూరులో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (సుమారు 12 లక్షల ఎకరాల ఆయకట్టు), ఈ జిల్లాలో నిర్మిస్తున్న కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు, శ్రీశైలం ఎడమగట్టు నుంచి టన్నెల్ ద్వారా నల్గొండ జిల్లాకు నీరందించాల్సి ఉన్న ఎలిమినేటి మాధవరెడ్డి (ఏ.ఎం.ఆర్) ప్రాజెక్టులకు నికర జలాల్లో నీటి వాటా లేదు. మిగులు జలాలపైన ఆధారపడ్డ ఈ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరగాలంటే బచావత్ ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను సరిదిద్ది కృష్ణా జలాల్లో పై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపు జరగాలి. ఈ లక్ష్య సాధన కోసమే అవశేష ఆంధ్రప్రదేశ్-తెలంగాణల మధ్య కృష్ణా జలాల పునః పంపిణీ కోసం కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయాలని దశాబ్దకాలం నుంచి కేసీఆర్ ప్రభుత్వం ప్రధానిని కోరుతూ వచ్చారు. ఈ సంవత్సరం అక్టోబర్ 6న ప్రధాని తెలంగాణ డిమాండ్‌ను ప్రస్తుతం ఉన్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు రెఫర్ చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో రాజీలేని పోరాటం చేస్తూ కృష్ణా జలాల పునఃపంపిణీకి కృషిచేయాల్సి ఉంటుంది.

తెలంగాణలో నిర్మాణంలో ఉన్న సీతారామ, డిండి-విద్యాసాగర్‌రావు ప్రాజెక్టులు, కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు ప్యాకేజీలు, ఎత్తిపోతల పథకాలు పూర్తయితే రైతులకు బోర్లు, బావుల అవసరం లేకుండా కోటీ ముప్పై అయిదు లక్షల ఎకరాల్లో పంట భూమికి రెండు పంటలకూ కృష్ణా-గోదావరి జలాలను అందించి ప్రపంచ రికార్డును తెలంగాణ దక్కించుకుంటున్నది. ఇప్పటికే సుమారు 80-85 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తున్నది ప్రభుత్వం. నదీ జలాల పారకం పెరిగిన ఆయకట్టులో బోర్లు, బావుల అవసరం తగ్గడంతో ఆ మేరకు విద్యుచ్ఛక్తి ఆదా అవుతున్నది.

తెలంగాణ భౌగోళిక, నైసర్గిక స్వరూపాన్ని అధ్యయనం చేస్తూ, జల వనరుల పట్ల సమగ్ర అవగాహనను ఏర్పరచుకోవడానికి కొన్ని వేల గంటలు శ్రమించారు కేసీఆర్. దీని ఫలితమే దేశమంతా కరువుతో విలవిలలాడుతుంటే 93 శాతం నీటి నిల్వలు గల జలసమృద్ధి రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. సాగునీటి వినియోగ సామర్థ్యంలో కూడా తెలంగాణ అగ్రభాగాన నిలిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఇటీవలే వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (వాల్మీ) తదితర సంస్థల అధ్యయనంలో వెల్లడైంది. కేసీఆర్ తెలంగాణ జల వనరుల రంగం, వ్యవసాయరంగంలో సాధించిన విజయాలను పరిరక్షించుకుంటూ మరింత ప్రగతిని ఈ రంగాలలో సాధించాల్సిన బాధ్యతను ప్రజలు కాంగ్రెస్ పాలకులకు అప్పగించారు.


**(వ్యాసకర్త: జల వనరుల నిపుణులు)**

# కశ్మీరియత్.. ఓ మహోజ్వల గాథ

భారతదేశ చరిత్రలో 1947 ఆగస్టు 15వ తేదీకి ఎంత ప్రాముఖ్యం ఉన్నదో 2019, ఆగస్టు 5వ తేదీకీ అంతే ప్రాముఖ్యం ఉన్నది. ఆనాడు విదేశీ శృంఖలాల నుంచి విముక్తి పొందితే, ఈనాడు రాజ్యాంగ 370 ప్రకరణం రద్దు ద్వారా భారత పార్లమెంట్ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలకు కేంద్రపాలిత హోదా కల్పించింది. తద్వారా భారత పార్లమెంట్ కశ్మీర్ ప్రజలను భారత జనజీవన స్రవంతిలో భాగం చేసి జాతీయ ఐక్యతను, సమగ్రతను కాపాడింది. ఈ పార్లమెంటు చట్టాన్ని వ్యతిరేకిస్తూ కశ్మీర్‌లోని ఫారూఖ్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ, మెహబూబా ముఫ్తీ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు గుప్కార్ కూటమిగా ఏర్పడి కశ్మీర్‌కు ప్రత్యేక హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. భారత అంతర్భాగమైన కశ్మీర్ సమస్య పరిష్కారానికి అక్కడి ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని ఉచిత సలహాలు ఇస్తున్నాయి. ప్రత్యేక హోదా రద్దువల్ల కశ్మీర్‌లో రక్తపుటేరులు పారుతాయని, దేశం విచ్ఛిన్నమౌతుందని కూడా వీరు దురాశతో రెచ్చగొట్టాలని చూసి భంగపడ్డారు. కశ్మీరియత్ అనేది కశ్మీర్ ప్రత్యేక సంస్కృతీ అనీ అందువల్ల కశ్మీర్ ప్రత్యేక ప్రతిపతి కొనసాగాలని ఈ జాతీయ పార్టీలతో పాటుగా భారత దేశం నుంచి సంపూర్ణ ఆజాదీ (విముక్తి) పొందాలని ఉగ్రదాడులకు తెగబడే జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ తదితర తీవ్రవాద సంస్థలు పార్లమెంట్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.



**ఆనందేశి నాగరాజు**
98488 38323



కశ్మీరియత్ లేదా కశ్మీర్ ప్రత్యేక సంస్కృతినీ కశ్మీర్ చరిత్ర అధ్యయనం ద్వారా తెలుసుకుందాం. నాగతెగల ప్రజలు మొదటగా కశ్మీర్‌లో స్థిరపడ్డారని, కశ్మీర్ చరిత్ర గురించి క్రీస్తుశకం 6వ శతాబ్దంలో రాసిన ప్రాచీన గ్రంథం నాగమత పురాణం వివరిస్తున్నది. ప్రాచీన కశ్మీర్ మూలాధారాలను ఈ గ్రంథం ఎంతగా వివరిస్తున్నదంటే, ఇందులో పేర్కొన్న యాభైకి పైగా దేవాలయాలు, క్షేత్రాలు ఇప్పటికీ కశ్మీర్‌లో ప్రసిద్ధమే!

మధ్యయుగాల నాటి భారత చరిత్రను యథాతథంగా వాస్తవిక దృక్పథంతో రాసిన ప్రముఖ సంస్కృత కవి, చరిత్రకారుడు కల్హణుడు కశ్మీర్ ప్రాచీన చరిత్రను మహాభారత కాలం నుంచి తన సమకాలీన (క్రీస్తు శకం 1149 వరకు) రాజవంశాల వరకు సమగ్రంగా 'రాజతరంగిణి' గ్రంథం ద్వారా అందించాడు. కల్హణుడు తాను అనుసరించిన శాస్త్రీయ చారిత్రక రచనా పద్ధతిని సొంత మాటల్లోనే ఇలా వివరించాడు. 'గతకాలపు ఘటనలను పక్షపాతరహితంగా, ఎలాంటి వివక్షలేకుండా న్యాయాధీశునిలా నమోదు చేసే వ్యక్తి మాత్రమే ప్రశంసకు అర్హుడు (1వ తారంగం: 7వ శ్లోకం).' కల్హణుడు అంతకుపూర్వం ప్రాచీన కశ్మీర్ చరిత్ర రాసిన సువ్రతుని గ్రంథాలను, నీల ఋషి రాసిన నీలమత పురాణాన్నీ, అట్లాగే క్రీస్తుశకం 990లో జన్మించిన క్షేమేంద్రుని లోక ప్రకాశ, చారుచర్య, బోధిసత్వ ధమ్మా, కల్పలత తదితర గ్రంథాలను అధ్యయనం చేసి ఆయా గ్రంథాల్లోని దోషాలను పరిహరించి రాజతరంగిణి రాశానని చెప్పాడు (1వ తారంగం: 9 నుంచి 14వ శ్లోకాలు). అంతేకాకుండా తాను కశ్మీర్ చరిత్రకు సంబంధించిన గతకాలపు రాజ శాసనాలు, రాజ దానపత్రాలు, శాసన దస్తావేజులను కూలంకషంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే రాజతరంగిణి రాశానని కూడా స్పష్టం చేశాడు.

కల్హణుడు భారతదేశాన్ని ఆర్యావర్తమని పేర్కొంటూ ఉత్తరాన హిమాలయాల నుంచి దక్షిణాన వింధ్య పర్వతాల వరకు విస్తరించిన దేశమని వర్ణించాడు (5వ తారంగం: 152వ శ్లోకం). భారతదేశాన్ని ఆర్యుల భూమి అని (1వ తారంగం: 34వ శ్లోకం)చెప్తూనే ఆర్యులంటే జాతిగా కాకుండా శిష్టులుగా పరిగణించారు (3వ తారంగం: 310వ శ్లోకం). నాగ తెగ ప్రజలు వితస్తా (జీలం) నదీ తీరంలో సర్పరాజు నీలుని పేరున నీలకుంద తీర్థాన్ని నిర్మించారని చెప్పాడు. మహాభారత యుద్ధం తర్వాత కశ్మీర్‌ను పాలించిన 37 మంది రాజులను ప్రస్తావించి, ఆ తర్వాత వచ్చిన 38వ రాజు ఖగేంద్రుడు నాగరాజ వంశాన్ని అంతం చేశాడని రాశాడు (1వ తారంగం: 89వ శ్లోకం).

> మహాభారత యుద్ధంలో విజయం తర్వాత ధర్మరాజు పట్టాభిషేకం జరిగినప్పటి ఖగోళ సంబధమైన ఘటనను ప్రస్తావిస్తూ శక సంవత్సరానికి పూర్వం 2026 సంవత్సరంలో సప్తర్షి మండలం మాఘ నక్షత్ర రాశిలో ప్రవేశించినపుడు ధర్మరాజు పట్టాభిషేకం జరిగిందని కల్హణుడు లెక్కతేల్చాడు. (1వ తారంగం: 56వ శ్లోకం).

సప్తర్షులలో ఒకరైన కశ్యప మహర్షి పేరుతో కశ్మీర్ భూమి పిలవబడుతోందని కల్హణుడు స్పష్టం చేశాడు (1వ తారంగం: 191వ శ్లోకం). ఒకప్పుడు పూర్తిగా జలమయమైన ఈ ప్రాంతాన్ని పర్వతరాజు హిమవంతుని కూతురు సతీదేవి (పార్వతి) పేరుతో సతిసర్ అని పిలిచేవారు. దీన్ని జనావాసయోగ్యంగా చేసిన కశ్యపుని పేరుతో 'కశ్యపమార్' ఏర్పడిందని నీలమత పురాణం వివరిస్తుంది. నాగరాజు నీలుని పాలనలోని ఈ ప్రదేశంలోనే కొండ ప్రాంతాల నాగులు, మైదానం ప్రాంతాల జనులు సహజీవనం ఆరంభించారని నీలమత పురాణం చెప్తున్నది. కశ్మీర్‌లోని మధుమతి నదీతీరంలోనే శారదాదేవి(సరస్వతి) ఆలయం ఉన్నదని రాజ తరంగిణి పేర్కొన్నది (1వ తారంగం: 37వ శ్లోకం). ఇక్కడే శారదా విశ్వవిద్యాలయ పీఠం ఉండేదని చెప్తారు. కశ్మీర్‌ను శారదా దేశంగా పిలవడాన్ని బట్టి దీని ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రముఖ సంస్కృత కవి, చరిత్రకారుడు బిల్హణుడు కశ్మీర్‌ను శారదా దేశంగా కీర్తిస్తూ ప్రపంచంలో వేరెక్కడా లేని అందమైన కవిత్వం, కుంకుమ పువ్వు సౌరభం కశ్మీర్ ప్రత్యేకతలని అన్నాడు. కర్ణాటక మహారాజు విక్రమదేవుని చరిత్రను విక్రమదేవ చరిత్రగా రాయడమే గాక తన ఆత్మకథ బిలహణీయం రాశాడు.

సంస్కృత భాషకు వ్యాకరణ భాష్యాన్ని అందించిన పాణిని క్రీస్తుపూర్వం 400 సంవత్సరంలో కశ్మీర్‌లో జన్మించాడని చెప్తారు. చరక సంహితను రాసిన ఆయుర్వేద పితామహుడైన చరకుడు (క్రీ.పూ.200) కశ్మీర్ ప్రాంతీయుడే. మరో ప్రముఖ కశ్మీర్ మహాకవి క్షేమేంద్రుడు దశావతార చరిత్ర, బృహత్ కథామంజరి వంటి మహాగ్రంథాలను రచించాడు. ఇతను క్రీ.శ.1028లో కశ్మీరుని పాలించిన అనంతుని సమకాలికుడు. క్రీస్తుశకం 11వ శతాబ్దంలో కావ్య ప్రకాశిక వంటి సాహిత్య గ్రంథం రాసిన ప్రముఖ అలంకార శాస్త్రవేత్త ముమ్మటుడు కూడా కశ్మీరీయుడే.

కశ్మీర్‌లో బౌద్ధమత వికాసం: క్రీస్తు పూర్వం 304 నుంచి క్రీస్తుపూర్వం 232 వరకు జీవించి ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఆంధ్ర దేశం వరకు భారతావనిని పాలించిన మౌర్య అశోకుడు శ్రీనగర్ పట్టణాన్ని నిర్మించాడని చెప్తూ బుద్ధుని బోధనలను అనుసరించి కశ్మీర్‌లో అనేక బౌద్ధ స్తూపాలను, విహారాలను కట్టించడమే కాకుండా లక్షలాది జనుల ఆవాసం కోసం శ్రీనగర్ పట్టణాన్ని నిర్మించాడని కల్హణుడు పేర్కొన్నాడు (1వ తారంగం: 104వ శ్లోకం).

(ఇంకా ఉంది..)

# ఉపాధిహామీపై కేంద్రం వివక్ష



**మోటె చిరంజీవి**
99491 94327

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి కనీసం 100 రోజులు పని కల్పించాల్సి ఉన్నది. ఇందుకు విరుద్ధంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేవలం 42 రోజులే పని కల్పించడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. గత ఐదేండ్లలో ఇదే అతి తక్కువ పనిరోజులు కల్పించిన ఆర్థిక సంవత్సరమని గణాంకాలు చెప్తున్నాయి. దీనికితోడు తక్కువ వేతనాలిస్తూ, పనిదినాల్లో కోత పెడుతూ, ఇప్పుడు ఆధార్ లింక్ చేస్తేనే వేతనాలిస్తామని కేంద్రం నిర్ణయించడంపై నిరుపేద కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కొత్త నిబంధనలను తెరపైకి తెస్తున్నది. ఇప్పటికే బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తగ్గించి, పనులు లేకుండా చేస్తున్న కేంద్ర సర్కారు ఏదో ఒక కొర్రీ పెడుతూ కూలీల ఉపాధిని దెబ్బతీస్తున్నది. తాజాగా ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే జాబ్‌కార్డులకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాలని షరతు విధించింది. కేంద్రం వార్నింగ్‌తో ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఆధార్ అనుసంధానం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఉపాధి హామీ పథకంతో వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలను అనుసంధానం చేయాలని తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు అభ్యర్థనలు పంపినా సానుకూలంగా స్పందించలేదు. కొవిడ్ తర్వాత ఉపాధి అవకాశాలు తగ్గి, గ్రామీణ ఆర్థికావ్యవస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో కేంద్రం ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి కేటాయించిన నిధులను తగ్గించి, పలు నిబంధనలను విధించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కార్మిక కుటుంబాలకు ఏటా వంద రోజులు పనులు దక్కడం లేదు. కొన్నేండ్లుగా కూలీలకు ఏటా 50 రోజులకు మించి పనులు ఉండటం లేదు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీపీ) కొవిడ్ సంక్షోభ సమయంలో ఉపాధి కోల్పోయి, సొంతూళ్లకు వచ్చిన కోట్లాది మంది వలస కూలీలకు ఉపాధి కల్పించి ఆదుకున్నది. ఈ బృహత్తర పథకానికి కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో కేటాయింపులను భారీగా తగ్గించింది. 2022-23 బడ్జెట్‌లో కూడా మోదీ సర్కార్ 25 శాతం మేర కోత విధించింది. రూ.98 వేల కోట్లు అంచనా కాగా రూ.73వేల కోట్లే కేటాయించింది. ఈ ఏడాది జనవరి 6 నాటికి దేశవ్యాప్తంగా 5.6 కోట్ల కుటుంబాలు ఈ పథకం కింద ఉపాధి పొందగా 225.8 కోట్ల వ్యక్తి పనిదినాలు నమోదయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జనవరి 24 నాటికి 6.49 కోట్ల కుటుంబాలు ఈ పథకం కింద ఉపాధి కోరగా 6.48 కోట్ల కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించింది. 5.7 కోట్ల కుటుంబాలు ఉపాధి హామీ పనులను ఉపయోగించుకున్నాయి. దేశ వ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పథకానికి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా కేటాయింపులు తగ్గిస్తూ వస్తోంది.

2020-21 బడ్జెట్‌లో రూ.61,500 కోట్లు కేటాయించిన బీజేపీ ప్రభుత్వం, 2021-22, 2022-23 బడ్జెట్లలో రూ.70 వేల కోట్ల చొప్పున కేటాయించింది. ఇక తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టినబడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయించింది రూ.60వేల కోట్లు మాత్రమే. ఇలా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై వివక్ష చూపుతుంది. తద్వారా కూలీలు ఉపాధి కోల్పోతున్నారు.